క్లుప్తంగా

కప్పతల్లి ఆట



కప్పతల్లి ఆట ఆడుతున్న యువకులు

ఇంద్రవెల్లి: వర్షం కురువాలని శనివారం మండల కేంద్రంలో గుడిహత్నూర్ మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన పలువురు యువకులు కప్పతల్లి ఆట ఆడారు. వ్యాపార దుకాణల వద్దకు వెళ్లి కప్పతల్లి ఆట ఆడి విరాళాలు సేకరించారు.

ప్రజా వ్యతిరేక విధానాలను వివరించాలి

ఆదిలాబాద్అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ అన్నారు. శనివారం పీఆర్టీయూ భవనంలో జిల్లాస్థాయి కార్యకర్తలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పార్టీ బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లంక రాఘవులు, సచిన్, కిరణ్, ఆశన్న, రాజన్న, దత్తు పాల్గొన్నారు.

నేడు మంచి నీళ్ల పండుగ

ఇచ్చోడ: ఇచ్చోడ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు మంచి నీళ్ల పండుగను నిర్వహించనున్నట్లు పంచాయతీ ఈవో సూర్య ప్రకాశ్ తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఉదయం 9.30 గంటలకు సర్పంచ్, వార్డు సభ్యులు, విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులతో ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు.

బస్‌పాస్ సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్: టీ9 బస్‌పాస్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన ఒక ప్రకటనలో కోరారు. పల్లెవెలుగు బస్సుల్లో మహిళలు, సీనియర్ సిటిజన్ల కోసం టీ9 పాస్ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. రూ. 100కు పల్లెవెలుగు బస్సుల్లో కండక్టర్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. 60 కిలోమీటర్ల పరిధిలో రానుపోను ప్రయాణించే వెసులుబాటు కలుగుతుందన్నారు.

డీఎంఈ సర్క్యులర్ ప్రకారం వేతనాలు ఇవ్వాలి

ఎదులాపురం: డీఎంఈ సర్క్యులర్ ప్రకారం కార్మికులకు వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ కోరారు. ఏఐటీయూసీ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కన్స్‌ట్రాక్షన్ ఏజెన్సీ సూపర్‌వైజర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. శానిటేషన్, సెక్యూరిటీ, పేషంట్ కేర్ కార్మికులకు సర్క్యులర్ ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వమాస్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు ఫ్లెక్సీ తిప్పలు



ఫ్లెక్సీలు తీసుకెళ్తున్న జీపీ కార్యదర్శులు

నేరడిగొండ: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆయా శాఖల ఆధ్వర్యంలో రోజుకో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆదివారం నీటి ట్యాంకుల వద్ద తెలంగాణ నీటి దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులే ఫ్లెక్సీలు, మిఠాయిలు తీసుకెళ్లారు. దీంతో పలువురు ఇవేమి వెట్టిచాకిరి అంటూ చర్చించుకుంటూ.. కనిపించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

తలమడుగు: గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని దేవాపూర్‌లో బోర్ మోటర్‌ను బిగించి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ అబ్దుల్లా, ఎంపీటీసీ రమేశ్, మాజీ జెడ్పీటీసీ బాబన్న, ఎంపీటీసీ వెంకన్న యాదవ్, షేక్ రఫీ, పోశెట్టి, రఘు, శ్రీనివాస్ యాదవ్, వెంకన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ మహిళా ప్రధాన కార్యదర్శిగా అరుణారెడ్డి

బోథ్: జిల్లా మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా సొనాల గ్రామానికి చెందిన వార్డుసభ్యులు నల్ల అరుణారెడ్డి నియమితులయ్యారు. అలాగే బోథ్ మండల మహిళా అధ్యక్షురాలిగా సొనాల గ్రామానికి చెందిన సోలంకి అనిత నియమితులయ్యారు. వీరికి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతారావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు చారులతలు నియామక పత్రాలు అందజేశారు.

వేగంగా.. సులభంగా

- జోరుగా డిజిటల్ చెల్లింపులు
- నగదు రహితానికే జనం ప్రాధాన్యం
- స్మార్ట్‌ఫోన్‌తో సులభమైన పేమెంట్స్



డిజిటల్ చెల్లింపులు చేస్తున్న కొనుగోలుదారుడు

ఆదిలాబాద్: ప్రస్తుతం ప్రపంచం డిజిటల్ దిశగా ముందుకు సాగుతోంది. ఒకప్పుడు డబ్బుల కోసం బ్యాంకులు ఏటీఎంల చుట్టూ తిరిగే ప్రజలకు అరచేతిలోనే అకౌంట్ హిస్టరీ ప్రత్యక్షమైపోతుంది. కరెన్సీ డిజిటల్ పేమెంట్స్ యాప్ వాలెట్‌లో ఒదిగిపోయాయి. ఇలా రూపుమార్చుకున్న రూపాయి నగదు రహిత చెల్లింపులకు పునాది వేసింది. సూపర్‌మార్కెట్, బట్టల షాపు, షాపింగ్ మాల్ అయినా.. పల్లె ప్రాంతమైనా.. పట్టణమైనా అంత డిజిటల్ చెల్లింపులదే జోరు.

సునాయాసంగా లావాదేవీలు..

కరోనా విజృంభన, నోట్ల రద్దు అనంతరం ప్రజలు డిజిటల్ చెల్లింపుల పట్ల ఆసక్తి చూపుతున్నారు. నగదు రహిత లావాదేవీల వైపు మొగ్గు చూపారు. ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా సులభతరమైన డిజిటల్ పేమెంట్స్ చేసేలా పలు సంస్థలు ఆప్, వెబ్‌సైట్లను అందుబాటులోకి తీసుకువచ్చాయి. గతంలో నగదు లావాదేవీలు జరపాలంటే బ్యాంకులు, ఏటీఎంల వద్ద గంటల తరబడి క్యూలైన్లలో వేచిఉండాల్సి వచ్చేది. వీటిని దృష్టిలో ఉంచుకొని ఆర్బీఐ నియంత్రణ సంస్థ నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్ఫేస్) వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఒక బ్యాంకు ఖాతా నుంచి మరో బ్యాంకు ఖాతాకు క్షణాల్లో సులభంగా నగదు బదిలీ చేసే వెలుసుబాటు కల్పించింది.

కూరగాయల నుంచి పెట్రోల్ దాకా..

అందరి చేతిలో స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్, డిజిటల్ పేమెంట్ యాప్ ఉండడంతో టీ కొట్టుకెళ్లి, షాపింగ్ మాల్స్ వద్ద ఎక్కడైనా క్యూఆర్ కోడ్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. నగదును జేబులో పెట్టుకోవడానికి ప్రజలు అనాసక్తి ప్రదర్శించే స్థాయికి చేరారు. స్మార్ట్‌ఫోన్‌తో వెళ్లి ఎంచక్కా షాపింగ్ చేసేస్తున్నారు. రెస్టారెంట్, పెట్రోల్ బంక్ ఇలా ఎక్కడైనా డిజిటల్ పేమెంట్లు చకచకా చేస్తున్నారు.

సులభంగా చెల్లిస్తున్నారు



గతంలో నగదు చెల్లింపుల సమయంలో ఇబ్బంది పడేవాళ్లం. చిల్లర సమస్య సైతం వేధించేది. అయితే ఫోన్ ద్వారా ప్రస్తుతం వినియోగదారులు సులభంగా డబ్బులు చెల్లిస్తున్నారు.

– సంతోశ్, బ్యాగ్ స్టోర్ నిర్వాహకుడు

అకౌంట్‌లోకే డబ్బులు..



గిరాకీ అధికంగా ఉండడంతో డబ్బులు తీసుకునే సమయంలో ఒక్కోసారి డబ్బులు తక్కువగా వచ్చేవి. హడావుడిలో నష్టం కలిగేది. క్యూఆర్ కోడ్ ద్వారా సమస్యలు తప్పాయి. యూపీఐ పేమెంట్స్‌తో అకౌంట్‌లో డబ్బులు పడుతున్నాయి.

– నర్సమ్మ, జ్యూస్ సెంటర్ నిర్వాహకురాలు

బీఆర్‌ఎస్ హయాంలోనే గిరిజనులకు గుర్తింపు

- జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్: బీఆర్‌ఎస్ హయాంలోనే గిరిజనులకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. శనివారం మండలంలోని సుంగాపూర్ కొలాంగూడలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. ఎస్టీ ఎస్‌డీఎఫ్ రూ. 20 లక్షల నిధులతో నిర్మించనున్న పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. జోడేఘాట్‌లో రూ. 25 కోట్లతో మ్యూజియం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దండారీ ఉత్సవాలకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. సుంగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోనే ఇప్పటి వరకు రూ. 50 లక్షల వరకు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కనక మోతుబాయి, సర్పంచు జీజాబాయి ప్రేంసింగ్, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ జాదవ్, ఐటీడీఏ ఏఈ రాథోడ్ సునీల్, మాజీ ఎంపీపీ ఆత్రం మీరాబాయి, ప్రధానోపాధ్యాయుడు వసంత్‌రావు పాల్గొన్నారు.

జీజాబాయి వర్ధంతి

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలో జీజాబాయి వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శివాజీని యోధునిగా మార్చింది జీజాబాయి అని నేషనల్ బుద్దిస్ట్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు అమృత్ రావ్ పాటిల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునేశ్వర్ సోమన్న, యేరేకార్ గణపతి, భూమ్‌రావ్, భగత్, గజ్జారాం, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం

కైలాస్‌నగర్: సమస్యలు పరిష్కారించే వరకూ పోరాటం సాగిస్తామని దివ్యాంగులు స్పష్టం చేశారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలు శనివారం 14వ రోజుకు చేరాయి. దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ ఇమ్రాన్‌కు వడదెబ్బ తలగడంతో దీక్ష శిబిరంలోనే చికిత్స చేయించుకున్నారు. దివ్యాంగుల కాలనీ ఏర్పాటు చేసే వరకూ దీక్షలు కొనసాగుతాయన్నారు. నాయకులు రితిక్, ముస్తఫా, సాజిద్, తరుణ్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

పరిహారం అందజేయాలి

బోథ్: రెండు నెలల క్రితం వర్షానికి దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారాన్ని అందించాలని మండల కేంద్రానికి చెందిన రైతులు తూము సూర్యం, కుమ్మరి రాజు జిల్లా సంయుక్త వ్యవసాయాధికారి శివకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కొంతమంది రైతులకు మొదటి విడతలో నష్ట పరిహారం అందిందని, మిగితా రైతులకు కూడా కూడా అందించాలని కోరారు.

గిరిజనుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఇంద్రవెల్లి: గిరిజనుల అభివృద్ధే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. మండలంలోని హర్కపూర్ అంద్‌గూడ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గిరిజనోత్సవాల్లో పాల్గొన్నారు. గిరిజన మహిళలతో కలిసి సంప్రదాయ నృత్యం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ గిరిజనుల అభ్యున్నతికి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పోటే శోభాబాయి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, జాదవ్ శ్రీరాంనాయక్, షేక్ సుఫీయన్, సర్పంచ్‌లు కుడే కూలాస్, శారద, రాథోడ్ రాంచందర్, పీఆర్ డీఈ పవార్ రమేశ్ పాల్గొన్నారు.

అంబేద్కర్ భవనం ప్రారంభం



అంబేద్కర్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌రూరల్: నూతనంగా నిర్మించిన అంబేద్కర్ భవనాన్ని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలో రూ. 2 కోట్ల వ్యయంతో నిర్మించిన అంబేద్కర్ భవనాన్ని శనివారం ప్రారంభించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అన్నివర్గాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, జిల్లా దళిత అభివృద్ధిశాఖ అధికారిణి సునీత కుమారి, దుర్గం శేఖర్, రత్నజాడే ప్రజ్ఞాకుమార్, చందాల రాజన్న, అలాల అజయ్, నక్క రాందాస్ పాల్గొన్నారు.

‘ఉద్యమకారులను పట్టించుకోని ప్రభుత్వం’

ఇచ్చోడ: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులను పట్టించుకోవడం లేదని వర్తమన్నూర్ మాజీ సర్పంచ్ గుంజల భాస్కర్‌రెడ్డి, మాజీ ఆత్మ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌లు ఆరోపించారు. శనివారం ఇచ్చోడలో మాట్లాడారు. తెలంగాణను వ్యతిరేకించిన వారికి పదవులు ఇచ్చి అందాలం ఎక్కించారని మండిపడ్డారు. బోథ్ నియోజకవర్గ వ్యాప్తంగా తెలంగాణ ఉద్యమకారులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తామన్నారు.

సాగుకు సన్నద్ధం..



తాంసి: వర్షాకాలం సమీపిస్తుండడంతో రైతులు పంటచేలను సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే తాంసి, భీంపూర్ మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో రైతులు పత్తి విత్తనాలు వేశారు. మరికొందరు విత్తనాలు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. భీంపూర్ మండలంలోని తాంసి(కె) గ్రామ శివారులోని పంటచేనులో రైతు రవీందర్ ఐదు అరకలతో భూమిని చదును చేసే పనులు చేపడుతున్నాడు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి



భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

నేరడిగొండ: గ్రామాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీటీసీ అనిల్ జాదవ్, ఎంపీపీ రాథోడ్ సజన్‌లు అన్నారు. శనివారం తెలంగాణ దశాబ్ది ఉత్సవంలో భాగంగా గిరిజనోత్సవం నిర్వహించారు. సవర్గాం, చిన్నబుగ్గారం గ్రామాల్లో గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచులు జాదవ్ కల్యాణి, విలాస్, ఎంపీడీవో అబ్దుల్ సమద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి కనబర్చాలి

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి కనబర్చాలని జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. శనివారం నేరడిగొండకు చెందిన యువకులకు వాలీబాల్ కిట్లు అందజేశారు. కాగా క్రీడా మైదానాన్ని చదును చేయిస్తానని ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

శబరిమాత ఆలయ నిర్మాణం కోసం జెడ్పీటీసీ అనిల్ జాదవ్ రూ.5వేల విరాళం అందజేశారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని ఆడేగామ గ్రామానికి చెందిన శబరిమాత భక్తులు శనివారం జెడ్పీటీసీ అనిల్ జాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

మానవత్వాన్ని చాటిన అనిల్ జాదవ్

నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్ మానవత్వాన్ని చాటారు. మండలంలోని శంకరపూర్‌కు చెందిన తులసీరాం ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న క్రమంలో ఆయనకు గుండెపోటు వచ్చింది. ఆసమయంలో అక్కడే ఉన్న అనిల్ జాదవ్ అంబులెన్స్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం బాధిత వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు.

‘బీఆర్‌ఎస్ లీడర్లకే సంక్షేమ పథకాలు’



మాట్లాడుతున్న గండ్రత్ సుజాత

ఆదిలాబాద్అర్బన్: బీఆర్‌ఎస్ లీడర్లకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత అన్నారు. శనివారం పట్టణంలోని ఆమె నివాసంలో మాట్లాడారు. గతంలో దళితబస్తీ, దళితబంధు పథకంలో కొందరు ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడ్డారని స్వయంగా సీఎం కేసీఆర్ పేర్కొనడం చూస్తే బీఆర్‌ఎస్ లీడర్ల అవినీతి ఏమేరకు కొనసాగుతుందో అర్థమవుతుందన్నారు. తాజాగా బీసీల కోసం రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించిన ప్రభుత్వం పలు నిబంధనలు పెట్టి బీసీలను మోసం చేస్తోందన్నారు. అర్హులైన పేదలకు ఎలాంటి లబ్ధి చేకూరడం లేదన్నారు. సమావేశంలో నాయకులు వెంకటరెడ్డి, కిష్టు, కన్య ప్రభాకర్ రెడ్డి, దండు మధుకర్, తుడుం వినోద్, వెంకట్, సంజీవ్, ఇమ్రాన్, సామ రూపేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజాధనాన్ని వృథా చేస్తున్న ప్రభుత్వం’



మాట్లాడుతున్న జెడ్పీటీసీ ఆర్క పుష్పలత

ఇంద్రవెల్లి: దశాబ్ది ఉత్సవాల పేరిట రాష్ట్ర ప్రభుత్వం ప్రజాధనాన్ని వృథా చేస్తోందని జెడ్పీటీసీ ఆర్క పుష్పలత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. సీఎం కేసీఆర్ గిరిజనులను అన్ని విధాలుగా మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీలను అణిచి వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. గిరిజనులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు, గిరిజనబంధు, అటవీహక్కు పత్రాలు ఇచ్చి ఉత్సవాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. తొమ్మిది ఏళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమి లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు మరప రాజు, మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, సోయం వినోద్, మెస్రం భోజ్జు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం



మాట్లాడుతున్న కంది శ్రీనివాస్ రెడ్డి

ఆదిలాబాద్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎమ్మెల్యే జోగు రామన్న ఆత్మహత్య చేసుకుంటానని ప్రకటించారన్నారు. అయితే అందుకు ఎమ్మెల్యే జోగు సిద్ధంగా ఉండాలన్నారు. నియోజకవర్గంలో తనగ్రాఫ్ పడిపోయిందనే విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, ఎమ్మెల్యేలు కుమ్మకు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు.

శాస్త్రీయ సమాజ స్థాపనకు పోరాటం

ఎదులాపురం: శాస్త్రీయ సమాజ స్థాపనకు సీపీఎం పోరాడుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవన్లో శనివారం కామ్రేడ్ కనక గణపతి, ఆత్రం భగవంతురావుల వర్ధంతిని నిర్వహించారు. దేశంలోని అట్టడుగు వర్గాల ప్రగతికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. దేశంలో ఎర్రజెండా ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు లంకా రాఘవులు, కిరణ్, పూసం సచిన్, బొజ్జ ఆశన్న, గంగన్న, సురేందర్, మంజుల పాల్గొన్నారు.

ఊరూరా గిరిజనోత్సవం



ఇంద్రవెల్లి: సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



తాంసి: గిరిజనోత్సవంలో పాల్గొన్న గిరిజనులు



బోథ్: ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని పలు గిరిజన గ్రామాల్లో శనివారం దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గిరిజనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని లీమ్‌గూడ, అంబుగాం, భీంపూర్ మండలంలోని టెక్డిరాంపూర్, కరన్‌వాడీ, భీంపూర్, గుంజాల గ్రామాల్లో కుమురం భీం చిత్రపటానికి నివాళులర్పించారు. సర్పంచ్‌లు లింబాజీ, యశ్వంత్, సంభు, గంగారం, సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ చౌహాన్ సునీత, ఉప సర్పంచ్ లోక శిరీష్‌రెడ్డిలు అన్నారు. శనివారం పంచాయతీ కార్యాలయంలో గిరిజనోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కొడప జల్జైజాకు, వార్డు సభ్యులు జాదవ్‌రమేశ్, ఉయికే భీశిరాం, మాజీ సర్పంచ్ పెరమళ్ల నారాయణ, ఈవో సూర్య ప్రకాశ్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో గిరిజనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ పటేళ్లను, ఆశ వర్కర్లను సన్మానించారు. గ్రామాల్లో గిరిజనోత్సవాలు జరుపుకోవడం సంతోషంగా ఉందని గిరిజనులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజలు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గిరిజనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ పటేళ్లను ఘనంగా సన్మానించారు. తెలంగాణ ప్రభుత్వం 9 సంవత్సరాలలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాల వివరించారు. కార్యక్రమాల్లో నోడల్ అధికారి పెందోర్ అర్జున్, సర్పంచ్‌లు కోరెంగా గాంధారి, సోయం రంభాబాయి, కుడే కైలాస్, ఆత్రం రత్తుబాయి, కినక జుగాదిరావ్, గోడం నాగోరావ్ పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని ఆయా గ్రామాల్లో గిరిజనోత్సవాన్ని నిర్వహించారు. నక్కలవాడలో ఆదివాసీ మహిళలు ర్యాలీ నిర్వహించారు. పట్నాపూర్‌లో ఆదివాసీ పెద్దలను సత్కరించారు. కార్యక్రమాలో పట్నాపూర్ సర్పంచ్ పంద్రం సుగుణ, నక్కలవాడ సర్పంచ్ విజయ్ కుమార్, జుగాది రావ్, ఎంపీవో జీవన్ రెడ్డి, ఏపీవో జగ్దేరావ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తే చర్యలు



మాట్లాడుతున్న ఏడీఏ రామకృష్ణ

తలమడుగు: నకిలీ విత్తనాలతో రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఇచ్చోడ ఏడీఏ రామకృష్ణ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఫర్టిలైజర్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక ధరలకు విక్రయించినా.. పీడీయాక్ట్ నమోదు చేస్తామన్నారు. నింబధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సుంకిడి గ్రామంలోని ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏవో మహేందర్, ఏఈవోలు, డీలర్లు పాల్గొన్నారు.